# పిల్లలూ ప్రేమించాలి

-యలమర్తి అనూరాధ

వేసవికాలపు తాపానికి నీడనిచ్చే చెట్లు నీడలేక అల్లాడిపోతున్నాయి. వాటి బాధను గుర్తించినట్లు రఘురామయ్య బావిలో నీళ్లు చేదుకుని బక్కెట్లో పోసుకుని వచ్చి చెట్లన్నిటికీ నీళ్లు పోయసాగాడు. తల్లి కోసం ఏడుస్తున్న పిల్లలకు తల్లి కనిపించినంత ఆనందమయింది ఆ చెట్లకు. నిముషాల్లో జీవం తెచ్చుకున్నాయి. కృతజ్ఞతలు చెప్పకుంటున్నట్లు తలలు వూపాయి. లాలనగా వాటిని స్పృశించాడాయన. మూగ భావాలే. వాటికి మాటలు రావుగా.

'మీరు నా బిడ్డలులాంటివారే. చల్లగా పెరగాలి' అని ఆయన అనగానే మరింతగా ఆకులను కదిలించాయా చెట్లు.

'వీటికున్నంత అభిమానం కనీ పెంచిన పిల్లలకు ఉండడంలేదు. మనుష్యులు ఇలా మారిపోతున్నారేమిటో' అనుకున్నాడు స్వగతంగా.

"ఏమండీ!" లోపలి నుంచి భార్య పిలుస్తుండడంతో చేసే పని ఆపి లోపలకు వెళ్లాడు.

"ఏమిటి భాగ్యం? ఏమన్నా కావాలా?"

"ఇలా అడుగుతారుగానీ తీరా చెప్పాక వినుక్కుంటారు. అదే నాకు భయం"

"లేదులే చెప్పు"

"మన పెద్దోడు చిన్నప్పుడు ముద్దుముద్దుగా చెప్పిన పద్యాల క్యాసెట్టు ఒక్కసారి పెట్టండి వినాలని ఉంది"

"అలాగే" అని దానికోసం ఒక అరగంట వెతికి టేప్‌రికార్డర్‌లో పెట్టి "నువ్వు వింటూ ఉండు. కాస్త పైపుతో చెట్లను తడిపి వస్తాను" అంటూ బయటకు వచ్చాడు.

"చెట్లకు క్రింద నీళ్లు పోస్తే పీల్చుకుంటాయి. కానీ పైన తడిపితే వానజల్లులో మనం తడిస్తే ఎంత ఆనందం పొందుతామో అంతకంటే ఎక్కువ సంతోషపడతాయి" అనుకుంటూ ఆ పని పూర్తి చేసాడు.

పిల్లలను కూడా ఇలానేకదా పెంచాడు! వాళ్ల అవసరాలను వాళ్లకంటే ముందే గ్రహించి తాము తిన్నా తినకపోయినా ముందు వాళ్లను సంతృప్తి పరిచేవాళ్లం. కానీ వాళ్లు ఇప్పుడేం చేస్తున్నారు? 'దిగులుగా ఉంది, ఒక్కసారి కనిపించి వెళ్లండిరా' అంటే రారు. ఫోటోలు పంపుతారు. వాటిని చూసి ఆనందించగలంగానీ అనుభూతి చెందలేముగా! అది చెబితే వాళ్లకు అర్థం కాదే. అర్థమయ్యీ రాలేక అర్థం కానట్టు ఉంటారేమో! తల్లిదండ్రులకున్న తపన పిల్లల్లో కనిపించదు. కావాలని బ్రహ్మ ఇలా రాసాడా? లేక మన పెంపకంలో లోపమా? పిల్లలకు ప్రేమించడం నేర్పాలా?

తమ ప్రేమ ఉగ్గుపాలు త్రాగి తమ ప్రేమతో రక్తమాంసాలు పెంచుకున్న పిల్లలకు తల్లిదండ్రులను ప్రేమించండిరా అని చెప్పడం ఎంత దౌర్భాగ్యం? ఎవరికీ ఇలాంటి కష్టం రాకూడదు. ఏ తండ్రీ పిల్లల గురించి తనలా బాధపడకూడదు?

భార్య మంచాన పడి మూడునెలలు అయింది. ఆవిడకు ప్రత్యేకమైన అనారోగ్యం అంటూ ఏమీలేదు పిల్లలను చూడాలనే దిగులు తప్ప. అదే మనోవ్యాధిగా ఆమెను బాధిస్తోంది.

ఎన్నిసార్లు కబురు చేసినా 'ఇదిగో వస్తున్నాం...అదిగో వస్తున్నాం' అంటూనే నెలలు గడిపేస్తున్నారు. కనీసం ఫోనులో కూడా మాట్లాడరు. పుణ్యానికో, పురుషార్థానికో అన్నట్లు ఎప్పుడో ఒకసారి కనిపిస్తారు. ఒక గంట మురిపిస్తారు. ఆ గంటలో భార్యాపిల్లలతో ఫోనులో ఎన్నిసార్లు ముచ్చట్లు ఆడతారో? కనీ పెంచిన తాము ఆపాటి చేయరా? అలా వాళ్లను చూస్తుంటే సంతోషించాలో, బాధపడాలో తెలియని పరిస్థితి. వాళ్ల పిల్లలను చూసిన దాంట్లో వందో వంతయినా తమకి చెయ్యాలనిపించదా? అసలిలా చేయడానికి మనసెలా ఒప్పుతోందో?

ఈ పిల్లలమీద దిగులుతో తన భార్య తనకు దూరమైతే ఒంటరిగా తను బ్రతగ్గలడా? అమ్మను చూడడానికే రాలేని వాళ్లు రేపు తనని చూస్తారా? తన గురించి తను ఏనాడూ ఆశపడలేదు. కానీ తన కళ్లముందు తన సగభాగాన్ని పట్టించుకోని పిల్లలకోసం కృంగి కృశించిపోతుంటే తట్టుకోలేకపోతున్నాడు. ఎన్నాళ్లు ఇలా?

కేసెట్ రివైండ్ చేస్తున్న శబ్దం! అంతే అలా వాళ్లని గుర్తు తెచ్చుకుంటూ విన్నదే వింటూ అదే జీవితమనే పిచ్చి భ్రమలో కొట్టుకుపోతుంటుంది. 'సంసారాన్ని మనమిద్దరమే ప్రారంభించాం. చివరకు మిగిలిందీ మనమిద్దరమే' అంటే వినదే. ఎంతసేపూ పిల్లలూ...పిల్లలూ...అని ఒకటే కలవరింత.

తనకు మాత్రం ఉండదా వాళ్లను చూడాలని. జరగదని తెలిసి దానికోసం ఆశపడే అవివేకి కాదు తను. అందుకే గుండె చిక్కబట్టుకుని ఇలా రాగాలు లేని రాయిలా బ్రతుకుతున్నాడు. బయట కుర్చీలు తెచ్చి వేసాడు.

"భాగ్యం! కాసేపు చల్లగాలి పీలుద్దువుగానీరా. కాసేపయ్యాక మళ్లీ వినవచ్చు. అవి ఎక్కడికీ పోవుగా" అంటూ రానని పసిపిల్లలా మారాం చేస్తున్నా ఆమెను తీసుకువచ్చి కుర్చీలో కూర్చోబెట్టి తను మరోదాంట్లో కూర్చున్నాడు. పక్కింట్లో పిల్లల కేరింతలు వినిపిస్తున్నాయి.

"నిన్న సెలవులు ఇచ్చారు. అప్పుడే పిల్లలు తాతయ్య ఇంటికి వచ్చేసిన ట్టున్నారే! క్షణాలలో భలే వాలిపోతారు. నాకు ముచ్చటవేస్తుంది. అలా మన ఇల్లు ఎప్పుడు కళకళలాడుతుందో?'' పిల్లలు రాలేదన్న బాధ కాస్త, వస్తే ఎంత సంతోషమో...రెండూ మిళితమై ప్రతిధ్వనిస్తున్నాయి ఆమె గొంతులో.

"మరే... వాళ్లు అడిగినవన్నీ ఓపిక లేకపోయినా ఆస్తులు అమ్మి చది వించి నా పిల్లలను నాకు మీరే దూరం చేసారు'' అంది కినుకగా భాగ్యం.

"భాగ్యం! ఇన్నాళ్లయినా నువ్వు నాకు అర్థంకావు. అప్పుడేమో ఇవన్నీ మనం పట్టుకుపోతామా? చదివించండి. రేపు వాళ్లు మనకింత ముద్ద పెట్ట



రని అనుమానమా? అంటూ పోరుపెట్టి మరీ చదువులు చెప్పించావు. ఇప్పుడు నింద నామీద వేస్తున్నావు. ఎలాగైనా నేను నీ అంత తెలివైనవాడి నికాను''


"ఛ...అలా అనకండి. ఏదో వాళ్లు రాలేదనే బాధతో అలా అంటానుగానీ మీ సంగతి నాకు తెలియదా? మీరసలు నా మాటలు పట్టించుకోకండి'' అంది.

"అలా అయితే సరే. ఇంకేమైనా మాట్లాడు''

"చెబితే నవ్వుతారేమోగానీ ప్రక్కింటికీ, మనకీ ఉన్న ఆ అడ్డుగోడ బద్దలు కొట్టేయాలనిపిస్తుంది ఒక్కోసారి''

"నీకు వాళ్లని చూడాలని ఉంది అంతేగా. చూద్దువుగానీరా'' అంటూ ఆమెను అమాంతం ఎత్తుకున్నాడు. పసిపాపలా దగ్గరకు తీసుకుని డాబా పైకి ఎక్కడం ప్రారంభించాడు.

"వద్దండీ'' అని ఆమె ఎంతగా మొత్తుకుంటున్నా వినలేదు.




## ఆకలి మంట!

ఆక్టోపస్ విపరీతమైన ఆకలితో ఉన్నప్పుడు ఏమీ దొరక్కపోతే తన చేతుల్లో ఒకదాన్ని తనే తినేస్తుందిట.

## సూపర్ పిల్

అల్జీమర్స్ వ్యాధి మీద ఇటీవల బ్రిటిష్ శాస్త్రజ్ఞులు చేస్తున్న పరిశోధనల పుణ్యమా అని ఆ వ్యాధి నివారణకి కనుగొన్న మందుని వాడితే ఆ జబ్బు నయం కావడమే కాకుండా మనుష్యులు వందేళ్లకుపైగా జీవిస్తారుట. ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ కాలేజీ ఆఫ్ మెడిసిన్ డైరెక్టర్ నీర్ బార్జిలై వచ్చే మూడేళ్లల్లో ఆ సూపర్‌పిల్ టెస్టింగ్‌కి సిద్ధమవుతుందని అంటున్నారు.

-తటవర్తి




"బక్కపలచగా ఉన్నావు. నిన్ను నేను మోయలేననుకున్నావా? ఏం ఫర్వాలేదు. మాట్లాడకు. నిముషంలో పైకి వెళ్లిపోతాం. అక్కడినుంచీ నువ్వు ఎంతసేపైనా వాళ్లను చూడవచ్చు, పోనీ పైన ఒక గది వేయించమంటావా?''

"వద్దు వద్దు. వాళ్లకోసం చేసిన అప్పులు తీర్చడానికే కష్టపడుతున్నాం. ఈ వయసులో మళ్లీ మనకోసం అప్పులా?'' అలా అంటూనే పక్కింటివైపు దృష్టి సారించిందామె.

తాతామనవళ్లు ఆడుకుంటున్నారు. వాళ్లబ్బాయి పేపరు చదువుకుంటూనే మధ్యమధ్యలో వాళ్లను గమనిస్తున్నాడు. అత్తగారు, కోడలు కలసి పూలు కట్టుకుంటున్నారు. ఆ దృశ్యం ఆవిడకు ఎంతో కమనీయంగా అనిపించింది. కుటుంబం అంటే అలా కదా ఉండాలి అనుకుంది మనసులో. ఇక ఆవిడ మన లోకంలో ఉండదని గ్రహించి రోడ్డువైపు తిరిగారాయన.

మనుషులూ, వాహనాలూ పోటీపడి మరీ పరుగులు తీస్తున్నారు. మనుషులయితే మరీనూ. ఒకళ్లకొకళ్లు ఎదురుపడితే నవ్వుకోవడానికి ఆలోచిస్తున్నారు. ఇక పలకరింపులెక్కడివి? తమ కాలంలో అలా రోడ్డుమీద నిలబడి మాట్లాడుకుంటూ గంటలు గడిపేసేవారు. ఇలాగే కొనసాగితే కొన్నాళ్లకు ఆప్యాయత అంటే ఏమిటి అనే పరిస్థితి వస్తుంది. ఇది మాత్రం సత్యం. ఆ రోజు రాకూడదు. ఒకవేళ వచ్చినా అది చూడడానికి తను ఉండకూడదు.

తనకిప్పుడు ఒకే ఆశ. తమ కాళ్లు చేతులు పని చేస్తూ ఉండగానే ఈ లోకం వదిలి వెళ్లాలని, ఒకరితో చేయించుకునే పరిస్థితి రాకూడదని, వాళ్లు విసుక్కుంటూ చేస్తే భరించే శక్తి తనకు లేదు. అసలు ఎవ్వరైనా అలాంటి స్థితికి వస్తే చేయడానికి ముందుకు వస్తారా అన్నది కూడా మీమాంసే. సొంతవాళ్లే దూరంగా పారిపోతుంటే ఇంక ఎవరు ముందుకొస్తారు?

చీకట్లు క్రమ్ముకోవడంతో క్రిందకు వచ్చేసారు. అవి వాళ్ల జీవితాలలోకి కూడా ప్రవేశిస్తున్నాయని ఆ దంపతులకి అప్పుడు తెలియదు.

పిల్లలను చూడాలనే కోరిక తీరకుండానే నిద్రలోనే ఆవిడ ప్రాణాలు అనంత వాయువుల్లో కలసిపోయాయి. ఆ కళ్లు తెరుచుకుని ఉంటే ఇంకా పిల్లలకోసం ఎదురు చూస్తాయేమో!

'ఇద్దరమూ కలిసే వెళదాం అంటే వినకుండా నన్ను వంటరి వాడిని చేసి వెళ్లిపోయావా భాగ్యం' అంటూ లోలోపలే కుమిలిపోయాడు.

అప్పుడు మాత్రం దిగారు పిల్లాపాపలతో కొడుకులు. అన్ని కార్యక్రమాలు బాగానే జరిపించారు.

ఆ తండ్రి హృదయం ఆ రవ్వంత పనికే ఆనందంతో పొంగిపోయింది. అది ఉండగా వీళ్లంతా వస్తే ఆ బలంతోనైనా కొన్నాళ్లు బ్రతికేదేమో!

ఆ రోజు తల్లి శవం మీద పడి వాళ్లిద్దరూ ఏడుస్తుంటే చుట్టుపక్కలవాళ్లు కన్నీళ్లు కార్చారు. కానీ తన కంట్లోంచి ఒక్క బొట్టు కూడా రాలేదు.

ఒకరకంగా చెప్పాలంటే వాళ్లే తన భార్యను తనకు కాకుండా చేసారు. చట్టానికి దొరకని హంతకులు. కొడుకులు కదా ఈ విషయాన్ని బయటకు చెప్పలేదు.

పిల్లలిద్దరూ వెళ్లిపోయేరోజు దగ్గర పడుతోంది.

"నాన్నా! మీరు ఒక్కరూ ఇక్కడ ఉండి ఏం చేస్తారు? మీరూ మాతో వచ్చేయండి. ఈ ఇల్లు అమ్మేద్దాం. ఆ డబ్బు బ్యాంకులో వేస్తే వచ్చే వడ్డీతో మీపై ఖర్చు వెళ్లిపోతుంది. ఏమంటారు?''

ముప్పై కావాలి, నలభై కావాలి, వంద కావాలి అంటే జేబులో పెట్టిన తండ్రికి ఈ రోజు తన ఆస్తి అమ్మిన దాంట్లోంచే పాకెట్‌మనీ ఇస్తారట. ఎంత దాతృత్వం?

ఇంకా నయం... ఇల్లు అమ్మిన డబ్బు కూడా తీసేసుకుంటామనలేదు. కొంతలో కొంత నయం అనుకున్నాడు మనసులో.

పిచ్చిమారాజు అమ్మాక అదీ వినవలసి వచ్చేది. ఆ మాట విని ఆ చిన్ని గుండె తట్టుకోగలదా? ఏమో కాలమే చెప్పాలి.

"ఈ ఊరు విడిచి నేనే రాలేనురా. ఇక్కడ ఉంటే అమ్మ నాతో ఉన్నట్లు అనిపిస్తుంది" అన్నాడు.

విసుక్కుంటూ వెళ్లిపోయారు అందరూ. అంతదాకా ఒలకబోసిన ప్రేమ ఏమయిందో వాళ్లకే తెలియాలి. ఆస్తులు కావాలి, కానీ బాధ్యతలు అక్కర్లేదు. అప్పుల మాట ఒక్కసారి కూడా ఎత్తరు.

పిల్లలకు మంచి చదువులు చదివించి వారికో దారి చూపించాలి, అది తల్లిదండ్రుల బాధ్యత అంటారు. మరి వృద్ధాప్యంలో కంటికి రెప్పలా పెద్దలను చూసుకోవాల్సిన బాధ్యత పిల్లలది కాదా? మరి అది పిల్లలెవరూ గుర్తుంచుకోరేం? అసలు ఆ ఆలోచన కూడా వాళ్లకు రాదా? వచ్చినా రానట్లు ఊరుకుంటారా?

పెద్దలను గౌరవించడం, వాళ్లకు ప్రేమ పంచడం, కడదాకా వారిని ఆప్యాయత, అనుబంధాల అంతస్థులలో అపురూపంగా చూసుకోవడం... ఇది కదా భారతీయ సాంప్రదాయం. పక్షులు రెక్కలు రాగానే ఎగిరిపోయినట్లు విదేశీ సంస్కృతిని అరువు తెచ్చుకుని ఇలా వృద్ధాప్యంలో వారిని వదిలిపెట్టి వెళ్లిపోవడం పద్ధతిగాలేదు. చెప్పినా పట్టించుకునే వారు ఏరి? ఎక్కడో నూటికి కోటికి అన్నట్లు ప్రక్కింట్లోలా ఆనందంగా గడుపుతున్నారు. అందరిలా తనూ ఈ సమస్యను వదిలెయ్యడమేనా? ఏదో కొత్త పరిష్కారం ఇవ్వాలనిపిస్తోంది. ఏదో చేయాలి? ఏదో చేయాలి? ఆలోచనల్లో పడ్డారాయన.

***

"నాన్నగారికి బాగాలేదు. వెంటనే బయలుదేరి రండి" అని ప్రక్కింటి భాస్కరరావుగారు ఫోన్ చేయడంతో అందరూ వచ్చేసారు.

"మీ కోరిక మీద ఇల్లు అమ్మేస్తున్నాను" అనగానే అందరి ముఖాలు వెలిగిపోయాయి. అంగీకారమే అన్నట్లు తలలూపారు.

అందరి ఆమోదం లభించగానే కొనుక్కునేవాళ్లు రావడం, సంతకాలు తీసుకోవడం, రిజిస్ట్రేషన్ చేయించుకోవడం, డబ్బు అంతా ఆయన చేతిలో పెట్టడం జరిగిపోయింది.

ఆ డబ్బును ఎవరెవరికి ఎలా పంచుతారా అని ఆశగా ఎదురు చూస్తున్న వారి ముందుకు లాయరు ప్రవేశించడం, ఆయన చేతుల్లో డబ్బు పెట్టడం, ట్రస్టుకు అది జమ చేయడం క్షణంలో జరిగిపోయింది. కట్టాల్సిన అప్పులకు మాత్రం కాస్త డబ్బు తీసి పక్కన పెట్టారు. వాళ్లూ వచ్చి వాటిని తీసుకునివెళ్లిపోయారు.

విస్తుపోయిన పిల్లలకు వాస్తవం మింగుడుపడలేదు. ఎందుకంటే ఇల్లు అమ్మిన డబ్బంతా ఆ ట్రస్టుకు విరాళంగా ఇచ్చేసాడాయన. దానిలో తన లాంటి వృద్ధులకు ఆసరాగా ఓ ఇల్లు కట్టించి ఇవ్వాలని, చనిపోయేవరకు తన సంరక్షణ బాధ్యత వారిదే అన్నది సారాంశం.

మంచిగా అడిగితే కొడుకులు ఒప్పుకోరని ఈ పథకం వేసారాయన. లేకుంటే తన ఇంటినే వృద్ధాశ్రమంలా మార్చాలనుకున్నారాయన. తనతో చెప్పకుండా సంతకాలు చేయించుకుంటే... అంతకైనా తగుదురు, అందుకే ఈ నిర్ణయం.

నోట మాట రాలేదెవ్వరికీ.

తల్లి పోయిన తరువాత-

"మాతో వచ్చేయి నాన్నా" అనే పలుకులేదు.

మౌనంగా వచ్చిన దారినే వెళ్లిపోయారు. ఒకవేళ వెళ్లినా తనని వాళ్లెంత బాగా చూస్తారో తనకు తెలుసు. 'మీకు మీరే మమ్మల్ని దూరం చేసుకున్నారు' అన్నట్లు ఒక చూపు విసిరారు.

అది ముందు ఊహించినదే. ఆయన నవ్వుకున్నారు.

ఇలాంటి పిల్లలకు ఇలానే బుద్ధి చెప్పాలి.

ఫోటోలోంచి భాగ్యం కోపంగా చూస్తోంది. ఎంతైనా తల్లికదా.

'నువ్వు తండ్రివి కాదా?'' అంతరాత్మ ప్రశ్న.

'అవును తండ్రినే. కానీ బిడ్డలు తండ్రిగా గుర్తించలేదుగా. అందుకే నేను తండ్రిని కానేమో! మరి మేమెవ్వరం?

శేషప్రశ్న!

దీనికి సమాధానం ఈనాటి పిల్లలే చెప్పాలి. ప్రేమించడం తెలిసిన పిల్లలకు మాత్రమే దీనికి జవాబు చిక్కుతుంది. ప్రయత్నించండి మరి!

★



## డాక్టర్ల సలహా

సల్మాన్ ఖాన్ తెగ సిగరెట్లు కాలుస్తాడని బాలీవుడ్‌లో జనాలందరికీ తెలుసు. ఇటీవల ఓ చిత్రం షూటింగ్‌లో వుండగా అనీజీగా వుందని సల్మాన్ చెప్పడంతో కంగారుపడిన యూనిట్‌వాళ్లు వెంటనే అతన్ని హాస్పిటల్‌కి తీసుకెళ్లారట. అన్ని పరీక్షలు చేసాక సమస్యకి పరిష్కారం చెప్పారట డాక్టర్లు- అదేంటంటే- అతను ఎంత వీలైతే అంత త్వరగా సిగరెట్లు తాగడం మానేయాల్సిందేనని. గతంలో సిగరెట్లు మానేస్తున్నట్టు చాలాసార్లు చెప్పిన సల్మాన్ ఆ మాటని నిలబెట్టుకోలేకపోయాడు. ఇప్పటికైనా కాస్త ఆలోచించి పొగ తాగడం మానేస్తాడని అతని సన్నిహితుల ఆకాంక్షట.

